క్లుప్తంగా

26న మెగా హెల్త్ క్యాంప్

అలంపూర్: మండలంలోని బుక్కాపురంలో ఈ నెల 26న మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు టీబీ యూనిట్ సూపర్‌వైజర్ గురుబసవయ్య, నోడల్ పర్సన్ నాగేషయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంపునకు డీఎంహెచ్‌ఓ సిద్దప్ప, డీపీసీ సాదిక్ హాజరవనున్నట్లు పేర్కొన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులు స్పూటం శాంపిల్స్ తీసుకొని క్యాంప్‌కు హాజరు కావాలని సూచించారు.

మురుగునీటిలో బుడగజంగాల కాలనీ



అయిజ: మున్సిపాలిటీలో పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న బుడగజంగాల కాలనీ మంగళవారం మురుగునీటిలో మునిగిపోయింది. కాలనీలో ఉన్న ప్రభుత్వ స్థలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు మట్టిని నింపడంతో కాలనీలో మురుగు ముందుకు పారకుండా ఇళ్ల మధ్యలో నిలిచింది. దీంతో కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది గుడారాలను సైతం తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కాలనీని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు పరిశీలించారు. ప్రభుత్వ స్థలంలో మట్టితో నింపడంతో సమస్య ఉత్పన్నమైందని కారకులైనవారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కేజీబీవీని సందర్శించిన అధికారులు



ధరూరు: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను ఎంఈఓ రవీంద్రబాబు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. కిచెన్ నిర్వహణ, పాఠశాల ఆవరణ, అసంపూర్తిగా ఉన్న ప్రహరీని పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, భోజన విషయంలో నాణ్యత పాటించాలన్నారు. ప్రతిరోజు అటెండెన్స్‌ను ఎంఆర్‌సీకి ఆన్‌లైన్‌లో పంపాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ గోమతి, సీఆర్‌పీ నర్సింహులు, టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విస్తృతస్థాయి సమావేశం

రాజోళి: అలంపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం బుధవారం శాంతిగనర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, ఏఐసీసీ కార్యదర్శి రాష్ట్ర ఇన్‌చార్జ్ విశ్వనాథ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని కార్యకర్తలందరూ పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు.

బాలికల భద్రతే సఖీ ప్రధాన లక్ష్యం



మల్దకల్: బాలికలకు అన్ని విధాల భద్రత కల్పించడమే సఖీ కేంద్ర ప్రధాన లక్ష్యమని ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్, సఖీ నిర్వాహకురాలు దివ్య అన్నారు. మంగళవారం మల్దకల్ హైస్కూల్‌లో విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాలు, గృహహింస, వరకట్న వేధింపులు, ఆడపిల్లల అక్రమరవాణా, లైంగిక వేధింపుల గురించి వివరించారు. సఖీ కేంద్రం అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆపద సమయంలో 1098ను సంప్రదించాలని సూచించారు. అదే విధంగా బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ యశ్వంత్, శేషన్న, ఉపాధ్యాయులు రాజేశ్వర్‌రెడ్డి, నాగేశ్వరరావు, గీత, విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను వినియోగించుకోవాలి

గోపాల్‌పేట: ఈనెల 28, 29 తేదీల్లో జరిగే సేవాలాల్ రాష్ట్రస్థాయి సామాజిక, రాజకీయ శిక్షణ తరగతులు వినియోగించుకొని విజయవంతం చేయాలని మంగళవారం సేవాలాల్ సేన రాష్ట్ర నాయకుడు తిరుపతినాయక్ పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమానికి సేవాలాల్ సేన నాయకులు వస్తారని తెలిపారు. గిరిజనులు రాజకీయంగా, సామాజికంగా ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ శిక్షణా తరగతులను వనపర్తి సేవాలాల్ సైనికులు సైతం వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

అంగన్‌వాడీలకు గ్రేడింగ్

- పిల్లల సంఖ్య పెంచేందుకు చర్యలు
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ తప్పనిసరి



ఉండవెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న మహిళలు(ఫైల్)

ఉండవెల్లి: అంగన్‌వాడీ కేంద్రాలను మొక్కుబడిగా నిర్వహించకుండా ఉన్నతాధికారులు పర్యవేక్షణ తప్పనిసరి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. చిన్నారులు కేంద్రానికి వచ్చిపోవడంతోనే సరిపెట్టకుండా వారికి ఆటాపాట నేర్పుతూ పాఠశాల విద్యపై ఉత్సాహం కల్గించేలా ప్రత్యేక దృష్టి సారించింది. చిన్నారులు లేరనే సాకుతో కేంద్రాలను మూసివేయడం సరికాదని, ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేసుకుని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్యను పెంచడంపై దృష్టి సారించాలని ఆదేశాలు జారీ చేసింది.

మార్చుకునే అవకాశం

ప్రభుత్వం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటే ఎక్కువ సంఖ్య వచ్చే అవకాశమున్న ప్రాంతాలకు కేంద్రాలను మార్చుకునే అవకాశం కల్పించింది. ప్రతి కేంద్రంలో తప్పనిసరిగా 20 మంది సంఖ్య ఉండేలా నిర్వాహకులు చూసుకోవాల్సి ఉంటుంది. బడిబాట తరహాలోనే గ్రామాల్లో చిన్నారులను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేందుకు ఐసీడీఎస్ అధికారులు, ఆయా కేంద్రాల నిర్వాహకులు ప్రయత్నాలు చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే కేంద్రాల నిర్వహణ సరిగ్గా లేదని భావన ఉంది. చిన్నారుల సంక్షేమంపై భారీగా ఖర్చు పెడుతున్నా అధికారులు సరిగా విధుల నిర్వహించడం లేదన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో దీన్ని సరిచేసేందుకు గాను ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని యోచిస్తోంది. అందులో భాగంగానే అధికారులు వారానికి కనీసం మూడు కేంద్రాలనైనా సందర్శించేలా కార్యచరణ సిద్ధం చేస్తోంది.



అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న టీచర్లు, సిబ్బంది(ఫైల్)

గ్రేడింగ్ ఇలా

అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు ఆధారంగా గ్రేడింగ్ ఇవ్వనున్నట్లు ఇటీవల ఉన్నతాధికారులు సూచించారు. అంగన్‌వాడీలో మౌలిక సదుపాయాలు, లబ్ధిదారులకు అందుతున్న సేవలు, చిన్నారుల సంఖ్యను బట్టి ఏ ప్లస్, ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించేందుకు చర్యలు తీసుకోనున్నారు. కేంద్రాలకు వచ్చిన గ్రేడ్ల ఆధారంగా అవార్డులు సైతం అందిచనున్నట్లు పేర్కొంది.

32 కేంద్రాలు

మండల పరిధిలో మొత్తం 32 అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటిలో 13 అద్దె భవనాలు, 9 సొంత భవనాల్లో నిర్వహిస్తుండగా 30 మంది టీచర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. వీటిలో 2473 మంది చిన్నారులు, గర్భిణులు 179 మంది, బాలింతలు 139 మందికి వీటి ద్వారా సేవలు పొందుతున్నారు. వారికి పౌష్టికాహారం అందించడం, ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందిస్తుంది.

ఈ- టెండర్ విధానం

అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన సరుకులు సరఫరా అయ్యేలా ప్రభుత్వం దృష్టి సారించింది. సరుకుల కొనుగోళ్ల విషయంలో సొంత నిర్ణయాలకు అవకాశం లేకుండా చేసింది. ఈ-టెండర్ విధానాన్ని పాటించేలా సూచనలు జారీ చేసినట్లు సమాచారం. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా కొనుగోలు కమిటీ ద్వారా టెండర్లు పిలవాలని ప్రభుత్వం సూచించింది.

అంగన్‌వాడీ బడిబాట

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేందుకు అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోంది. అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికి తిరిగి చిన్నారులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తోంది.

కేంద్రాల పనితీరుపై దృష్టి

అంగన్‌వాడి కేంద్రాల్లో చిన్నారుల సంఖ్యను పెంచుకునేందుకు గాను అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం చేపడతాం. కేంద్రం నిర్వాహకులు ప్రతి ఇంటికెళ్లి చిన్నారుల గురించి ఆరా తీస్తారు. రెండేళ్లు నిండిన చిన్నారులను కేంద్రాలకు పంపించేలా తల్లితండ్రులకు అవగాహన కల్పిస్తాం. సంఖ్య తక్కువగా ఉన్న ప్రాంతాలకు మార్చుతాం. కేంద్రాల పనితీరుపై ప్రత్యేక దృష్టి పెడతాం.

– సుజాత, సీడీపీఓ

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు, నాయకులు

అయిజ: ఎన్నికల సమయంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు తరగతులు బహిష్కరించి నిరసన చేపట్టారు. బీజేపీ నాయకులు విద్యార్థులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చేసిన ఎన్నికల ప్రచారంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అయిజలో ఎన్నో వాగ్దానాలు చేశారని, ఎంపీగా మల్లురవి గెలిస్తే అయిజ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు హామీలు నెరవేర్చలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై అధికారుల దాడులు



పాఠశాలలో తనిఖీలు చేస్తున్న అధికారులు

గద్వాలటౌన్: జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో అనధికారింగా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు అధిక ధరలకు విక్రయిస్తున్నారని నిత్యం విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనలు చేస్తున్నారు. మంగళవారం టీఆర్ఎస్వీ విద్యార్థి సంఘం నాయకులు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో అక్రమంగా అధిక ధరలకు పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్న విషయాన్ని విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్ తన సిబ్బందితో కలిసి పాఠశాలపై దాడి చేశారు. అధిక ధరలకు విక్రయిస్తున్న పాఠశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పాఠ్య పుస్తకాలు ఉన్న గదిని సీజ్ చేశారు. అనంతరం పలు పాఠశాలను తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కుర్వ పల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అమెరికా దురాక్రమణ విధానాలను ఖండించాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

గద్వాల: ప్రపంచ దేశాలపై అమెరికా చేస్తున్న దురాక్రమణ విధానాలను ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నర్సింహ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇరాన్‌పై అమెరికా చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచంలో సహజ వనరులు ఉన్న దేశాలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధిపత్యం చెలాయిస్తూ అమెరికా నిరంతరం దాడులకు తెగబడుతుందన్నారు. అందులో భాగంగానే ఇరాన్‌పై దాడులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మికులు బాలకృష్ణ, ఆంజనేయులు, విష్ణు, రామాంజనేయులు, గజేంద్ర, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్



మునగాలల్లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇటిక్యాల/అయిజ/ఎర్రవల్లి/మానవపాడు/కేటీదొడ్డి: పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని పార్టీ మండలాధ్యక్షులు రుక్మందర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఇటిక్యాల మండలంలోని మునుగాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు హౌసింగ్ ఏఈ ప్రియాంకతో కలసి ముగ్గుపోసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంగాధర్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

❖ అయిజ మండలంలోని ఉప్పల గ్రామంలో అలంపూర్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెన్న అధికారులతో కలిసి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. మున్సిపాలిటీలోని 11వ వార్డులో మున్సిపల్ అధికారులు ఇంటి నిర్మాణాలకు ముగ్గుపోశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంటేశ్వర్లు, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

❖ ఎర్రవల్లి మండల పరిదిలోని కోదండాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు ముగ్గుపోసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సోమనాద్రి, వెంకటేష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

❖ మానవపాడు మండంలోని పెద్దపోతులపాడు, కొర్విపాడు గ్రామాల్లో ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మార్కింగ్ ఇచ్చారు. అనంతరం భూమిపూజ చేశారు.

❖ కేటీదొడ్డి మండల పరిధిలోని ఇర్కిచేడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఎంపీడీఓ కృష్ణమోహన్ భూమి పూజచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సొంతింటి కల నేరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కృష్ణ, మల్‌రెడ్డి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి



మానవపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని డీసీసీ జనరల్ సెక్రటరీ మహ్మద్ సిరాజ్‌అహ్మద్ అన్నారు. మంగళవారం పల్లెపాడులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలన్నారు. చిన్నారుల బరువు, ఎత్తు కొలతలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పరమేష్‌నాయుడు, బీసీరెడ్డి, రాధాకృష్ణగౌడ్, నరసింహ, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రైతుభరోసా సంబరాలు



ఎర్రవల్లి/ఇటిక్యాల: మండలాల పరిధిలోని రైతు వేదికల్లో వ్యవసాయ అధికారులు ఆధ్వర్యంలో మంగళవారం రైతుభరోసా సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగించడాన్ని రైతువేదికలలో ఏర్పాటు చేసి స్క్రీన్ ద్వారా అధికారులు, రైతులు వీక్షించారు. ఎర్రవల్లి మండలంలోని పుటాన్‌దొడ్డి రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతుభరోసా సంబరాలకు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ హాజరై నాయకులు, రైతులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అదే విధంగా ఇటిక్యాల మండల కేంద్రంతో పాటుగా ఆయా గ్రామాల్లోని రైతువేదికలలో రైతు భరోసా సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కంది విత్తనాలు పంపిణీ

అయిజ: మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి జనార్ధన్, అలంపూర్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెన్న రైతులకు ఉచితంగా కంది విత్తనాల చిరుసంచులు అందజేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడారు. అయిజ మండలానికి 560 విత్తనాల పాకెట్లు వచ్చాయన్నారు. ఒక్కో పాకెట్‌లో 4 కేజీల విత్తనాలు ఉంటాయన్నారు. ఒక రైతుకు ఒక పాకెట్ మాత్రమే పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

ఎర్రవల్లి: సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అలంపూర్ సీఐ రవిబాబు సూచించారు. మంగళవారం కోదండాపురం పీఎస్ పరిధిలోని బోరవెల్లి గ్రామంలో ఎస్‌ఐ మురళి 37 మంది పోలీస్ సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 120 ఇళ్లను తనిఖీ చేసి సరైన ధ్రువపత్రాలు లేని 64 ద్విచక్రవాహనాలతో పాటు ఆరు ఆటోలు, రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సామాజిక అంశాలపై కూడలిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మురళి మాట్లాడుతూ.. మహిళల సంరక్షణ కోసం ప్రత్యేకంగా షీటీమ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కార్డన్ సెర్చ్‌లో మాట్లాడుతున్న పోలీసులు

రహదారికి తాత్కాలిక మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..



రాయచూర్ రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో మట్టి పోస్తున్న ఆర్‌అండ్‌బీ గ్యాంగ్‌మెన్లు

ధరూరు: గద్వాల–రాయచూర్ అంతరాష్ట్ర రహదారి పొడవున అడుగడుగున ఉన్న గుంతలు వాహనదారులకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. ఈ నెల 10న సాక్షి పత్రికలో 'అడుగడుగునా గుంతలే' అనే శీర్షికతో సమగ్ర వార్తా కథనాన్ని ప్రచురించింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాయచూరు రోడ్డులో గ్యాంగ్‌మెన్లతో రోడ్డు పక్కన మట్టిని గుంతల్లో నింపే పనులు చేపట్టారు. కాగా, వర్షాకాలంలో గుంతల్లో నింపిన మట్టి ఎంత కాలం ఉంటుందో అధికారులకే తెలియాలని, కనీసం తారుతో అన్న గుంతలు పూడ్చకుండా మట్టి వేసి చేతులు దులుపు కుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టీచర్‌ను నియమించండి.. బడికి పంపుతాం



పొలాల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ అశోక్‌కుమార్

అలంపూర్: పాఠశాలలో మరొక టీచర్‌ను నియమిస్తే మా పిల్లలను ప్రభుత్వ బడికే పంపుతామని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. మండలంలోని సింగవరం-1 గ్రామంలో ఎంఈఓ అశోక్‌కుమార్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో పొలం పనులు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన బోధన అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. గతేడాది పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు బోధన చేసేవారిని ప్రస్తుతం ఒక ఉపాధ్యాయుడు ఉండటంతో ప్రైవేటు పాఠశాలకు పంపుతున్నట్లు ఎంఈఓకు తెలిపారు. పాఠశాలకు మరొక ఉపాధ్యాయుడిని నియమిస్తే తిరిగి ప్రభుత్వ పాఠశాలకు పంపుతామని పేర్కొన్నారు. ఈ విషయమై ఈ నెల 26న విద్యార్థుల తల్లిదండ్రులతో గ్రామసభ నిర్వహించనున్నట్లు ఎంఈఓ తెలిపారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు పంపే విధంగా తీర్మానం చేయనున్నట్లు ఎంఈఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.రమేష్, ఉపాధ్యాయులు శివశంకర ఆచారి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సమస్యలు పరిష్కరించాలి



ఆస్పత్రిలో సమస్యలపై ఆరా తీస్తున్న ఐద్వా సంఘం సభ్యులు

గట్టు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆధ్వర్యంలో సంఘ సభ్యులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. మరుగుదొడ్లు, మంచి నీటి సమస్య, ప్రహరీ వెంట పిచ్చి మొక్కలు పెరిగి ఇబ్బందికరంగా ఉన్నట్లు తెలిపారు. ప్రతిరోజు 100 నుంచి 120 మందికి దాకా ప్రజలు వస్తుంటారని సిబ్బంది కొరత కారణంగా రోగులు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాణి, జయమ్మ, పావని తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు అందజేస్తున్న డీకే స్నిగ్ధారెడ్డి

గద్వాల: ఏక్ పేడ్ మాకే నామ్ నినాదంతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబభవానీ ఆలయంలో మొక్కలు నాటారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 5 నుంచి ఆగస్టు 15 వరకు ప్రతి ఒక్కరు తమ తల్లిపేరిట మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. భవిష్యత్ తరాలకు హరిత భూమిని అందించేందుకు సామూహిక బాధ్యతగా భావించాలన్నారు. కార్యక్రమంలో రామాంజనేయులు, రాంచంద్రారెడ్డి, రవికుమార్, అక్కల రమాదేవి, రజకజయశ్రీ, కుమ్మరి శ్రీను, కిరణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు ఛిద్రం



అలంపూర్‌లో మాట్లాడుతున్న సీఐ రవిబాబు



శాంతినగర్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

అలంపూర్: మాదక ద్రవ్యాలతో జీవితాలు ఛిద్రమవుతాయని సీఐ రవిబాబు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు యువతను చెడు మార్గంలో నడిపిస్తాయన్నారు. చదువును దూరం చేసి భవిష్యత్‌ను నాశనం చేస్తాయన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు మాదక ద్రవ్యాల వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకలు రాముడు, ట్రైనీ ఎస్‌ఐ నిమ్మలకుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నషాముక్త్ భారత్‌పై అవగాహన

మానవపాడు: మండల కేంద్రంలో నషా ముక్త్ భారత్‌పై మంగళవారం ఐసీడీఎస్, సీడీపీఓ సుజాత ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడారు. నషా ముక్త్ భారత్‌పై కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువత దూరంగా ఉండాలి

రాజోళి: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని శాంతిగనర్ సీఐ టాటాబాబు అన్నారు. శాంతిగనర్‌లోని శివశివాని స్కూల్‌లో పోలీసులు డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరు డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

జీవితాలు సర్వనాశనం

ఎర్రవల్లి: మత్తుతో జీవితాలు సర్వనాశనమవుతాయని ఎస్‌ఐ మురళీ అన్నారు. మండల పరిదిలోని కోదండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేకత వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగం కలిగే నష్టాలపై విద్యార్థులకు వివరించారు. మత్తు పదార్థాలు వాడినా లేదా విక్రయించినా డయల్ 100, 14446, 1908కు సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చేంకుదు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు.

మాదక ద్రవ్యాలు ప్రాణాంతకాలు

అయిజ: మాదక ద్రవ్యాల వినియోగం ప్రాణాంతకాలని ఎస్‌ఐ శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శశిధర్‌రెడ్డితో కలిసి విద్యార్థులకు మాదక ద్రవ్యాలు వలన కలిగే నష్టాలు తెలియజేశారు.

విద్యార్థులకు అవగాహన

కేటీదొడ్డి: గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్‌ఐ శ్రీనివాసులు అన్నారు. మండల పరిధిలోని నందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్‌మోసాలు, డ్రగ్స్ మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.